

## శ్రీమతి కొమ్మూరి ఉషారాణి

సామాన్యంగా ఎవరింట్లో అయినా శుభకార్యం జరుగబోతోందంటే ఆ వార్త నిముషాలమీద ఆ నోటా ఈ నోటా వూరంతా పాకిపోతుంది. కేవలం వార్తలు మోసుకెళ్ళి ప్రచారం చెయ్యటంలోనే తమ మనస్సు, కాలం కేంద్రీకరిస్తుంటారు కొందరు. మనుష్యులయిన తరువాత తోటివాళ్ళ వ్యవహారాల్లో ఆ మాత్రం కౌతుకం, పరోపకార బుద్ధి వుండకపోతే ఎలా మరి! తప్పక వుండవలసిందే! కాని పాపం సుశీల విషయంలో మటుకు అది వక్రించింది. సుశీల పెళ్ళి వార్త మోసుకెళ్ళిన వార్తాహరుల్ని లోకం వెక్కిరించింది. "అబ్బో! ఇలాటి కబురు చాలాసార్లు వినటమయింది" అని విసుక్కుంది. నమ్మినంతే నమ్మను పొమ్మంది.

అలాటప్పుడు సుశీలని దురదృష్టవంతురాలనక ఏం చేస్తాం? అంతే కాదు "ఏ ముహూర్తాన పెట్టారో ఆ పేరు. నెమ్మదైన పిల్ల కాదు. ఆ పిల్లకింక పెళ్ళేమిటి?" అన్నది ఓ ముసలవ్వ. "నూరు పోకళ్ళు పోతే పెళ్ళి ఎలా అవుతుంది? ఏదో కాశీమజిలీ కథలోలాగ గుఱ్ఱం ఎక్కి రాజకుమారుడు దిగి రావాలంటే కుదురుతుందా? అప్పటికే ఇరవైయేళ్ళు నిండాయి" అన్నది ఓ యిల్లాలు రహస్యంగా. "అయినా పోనిద్దురూ! ఇప్పటికి రెండు మూడేళ్ళనుంచీ పెళ్ళి మాట అనుకుంటూనే వున్నారు. ఎందుకు కావటం లేదో పరమాత్ముడికే తెలుసు" అని అనుమానం వెలిబుచ్చింది ఓ మహా సాధ్వి.

సుశీల పెళ్ళి విషయం ఇంత గలంతు జరుగటానికి సుశీల వికారంగా ఉండే మనిషి అయితే కాదు. కాని చూపులకి బాగానే వుంటుంది. కన్ను లొట్టా కాలు కుంటీ లేవు. నవ్వితే ముఖంలో మరికొంత ఆకర్షణ కనపడుతుంది. మాట్లాడుతుంటే ఆ కళ్ళల్లోకి చూసి మరీ మాట్లాడాలనిపిస్తుంది. ఆమె స్నేహం, ఆమె సాహచర్యం అమృతంతో సరిపోలినదంటారు ఆమె అంతరంగిక మిత్రులు కొందరు.

సుశీల పెద్ద పెద్ద పరీక్షలు పాసవలేదు. లావుపాటి పుస్తకాలు చదవలేదు. అతి తెలివిగా, చమత్కారంగా మాట్లాడనూ లేదు. కానీ రోజూ పేపరు చదువుతుంది. ప్రపంచ జ్ఞానముంది. పదిమంది మధ్యకు వెళ్ళినా తన మర్యాద ఆత్మగౌరవం నిలబెట్టుకోగలిగే సంస్కారముంది. అంతో ఇంతో పని పాటలూ వచ్చు.

సుశీలంటే తల్లిదండ్రులకి చాలా ముద్దు. ఒక్కతే కూతురనే గారాబంవల్లనో మరే కారణం చేతో ఆమెని కొంచెం పెంకి ఘటంగానే తయారుచేశారు. నిజానికి ఆ యింటికి ఆ అమ్మాయే 'రాణి' అని చెప్పాలి. ఆ పిల్ల మాట ఘట్టిగా కాదు అనడానికి ఆ తల్లికీ తండ్రికీ ఇద్దరికీ ధైర్యం లేదు. అందుకే సుశీల తన పెళ్ళి విషయంలో పూర్తి "ఫ్రీడమ్ డిక్లేర్" చేసింది. మొదట్లో తల్లీ, తండ్రీ అందుకు చాలా మురిసిపోయారు. కానీ కాలం ఎవరికోసం ఆగుతుంది కనుక? ఎక్స్‌ప్రెస్‌లాగా చకచకా సాగిపోయింది. దాంతో ఆ దంపతులు కొంచెం గాభరా పడసాగారు.

బంధువర్గంలో కానీ యితరత్రా గానీ ఏదైనా మంచి సంబంధమున్నా సుశీలకు చెప్పటానికే జంకేది తల్లి. "ఏమో దాని వుద్దేశాలేమిటో మనకేం తెలుసు? ఇప్పుడు మించిపోయిందేముంది. అదేం నాకు బరువా?" అనేవాడు తండ్రి నానుడుగా. 'మీరు అన్నిటికీ అంతే చూస్తూ కూర్చుంటారు. వుద్దేశాలేమిటి! వుద్దేశాలు! ఈ రకంగా అయితే ఇక అమ్మాయికి పెళ్ళి అయినట్టే" అని నెత్తిన చేతులు పెట్టుకు కూర్చునేది తల్లి. కాని సుశీల ఏ అబ్బాయితో అయినా కాస్త నవ్వుతూ మాట్లాడితే, ఏ అబ్బాయిని గురించయినా ఓ మంచిమాట మాట్లాడితే, ముఖం చేటంత అయ్యేది తల్లికి. కళ్ళు జోడించి పరిశీలనగా చూసిన వ్యక్తి కేసి చూసేవాడు తండ్రి. కానీ వారి అనుమానాలు, సదుద్దేశాలు అలా వుంటూండగానే, ఆ అబ్బాయికి పెళ్ళి అయిపోవటమో, లేక సుశీలే హఠాత్తుగా ఓ రోజు అతనికేసి చురచురా చూడటమో జరిగేది.

ఒకసారిమటుకు ఇక ఆ తల్లీ తండ్రీ ఓపిక పట్టలేకపోయారు. అన్ని విధాలా వరుడిగా కావలసిన యోగ్యతలు వుండి వంకపెట్టటానికి వీలులేని ఓ అబ్బాయి సుశీలకోసమే అన్నట్టు పదే పదే యింటికి రావటం, అందుకు అభ్యంతరం లేనట్లే సుశీల మసలటం, బుద్ధిపూర్వకంగానో లేకో అతను వచ్చేవేళకి కాస్త ముస్తాబై వుండటం, ఒక్కొక్కప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్టు పరాకుగా వుండటం, పసికట్టిన దంపతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. "మీ అమ్మాయికి పెళ్ళి ఎప్పుడు? ఇప్పట్లో పని చెయ్యదలచుకోలేదా?' అని చెప్పుదంటూ ప్రశ్నలు వేసి తెగ వేధిస్తున్న బంధువులకీ, స్నేహితులకీ కూతురికి మూడువంతులు పెళ్ళి నిశ్చయమయిందనే చెప్పేసింది ఆ ఆనందంలో తల్లి. తండ్రి కూతుర్ని ఓ రోజు తన గదిలోకి పిలిచి ఆ ప్రసంగం తీసుకువచ్చాడు.

"ఇదేమిటి నాన్నా? చివరికి నువ్వూ ఇలా మాట్లాడతావని అనుకోలేదు. ఎవరి దగ్గరయినా మాట్లాడ్డానికిగానీ పలకరించి తిన్నగా సమాధానం చెప్పటానికి గానీ భయం భయంగానే వుంటోంది నాకు ఈ మధ్య. అమ్మయితే సరేసరి. చాదస్తం. హడావుడి ఎక్కువ. 'పెళ్ళో, పెళ్ళో' అని నా ప్రాణం తినేస్తోంది. ఛ ఛ ఏమి ఫ్రీడమ్ ఇది? నన్ను ఎవరితో మాట్లాడనివ్వరు. మంచి మనిషిగా చూడనివ్వరు. ఆ మనిషి మనసేమిటో, అభిరుచులేమిటో కొంతలో కొంతయినా తెలుసుకుందుకు ప్రయత్నించేలోపే నానా హంగామా చేసి అప్పుడే అతను నా మెళ్ళో మంగళసూత్రం కట్టేసినట్టు వూహించుకుని తాటాకు టపాకాయలాగా వూరంతా చాటి నాకు ఊపిరాడనివ్వకుండా చేస్తున్నారు. మీరు చేసే గడబిడ, ఈ అభిప్రాయ ప్రకటనలు నా పైన ఎలా పనిచేశాయో, నాకు నేనుగా ఏదీ నిర్ణయించుకోలేని విచిత్ర పరిస్థితులకు ఎలా దారితీసాయో మీకు తెలియదు" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతం అయి అక్కడినుంచి వెళ్ళిపోయింది సుశీల.

ఆ తర్వాత ఓ రోజు ఫోనులో ఒకే సారి గూడా పక్కయింటి పేరంటానికి వెళ్ళిన సుశీల్ని ఓ సాయంత్రం పేరంటాళ్ళంతా ముట్టడించారు. 'అమ్మా! ఎన్ని పెళ్ళిళ్ళు చేసారే మీ రింటా? చెప్పవే నాకు!" అని ఒకావిడ ఒళ్ళోపడి గోలుమంది. సుశీల ఇంటికి వస్తూ 'ఛా! ఇవేం మాటలు! పాడు మాటలు! ఎన్ని పెళ్ళిళ్ళేమిటి? ఏమో పెళ్ళిళ్ళు కాదా అని అడిగితే తప్పేముంది? అది సహజం. అడిగినట్టిని వాళ్ళ నోళ్ళు



"ఛ—ఛ—! ఏమి ఫ్రీడమ్ ఇది"

మూస్తామా చెప్పు!" అంటూ కూతుర్ని ఓదార్చబోయింది తల్లి. ఆ దృశ్యం చూసిన తండ్రి ఒక్కటే నిర్ణయానికి వచ్చాడు. సుశీలలో ఇంకా పసితనపు ఛాయలు పోలేదనీ, "పెళ్లి బరువు" పూర్తిగా ఆమెమీద వదిలేయటం తన అవివేకమేననీ వాపోయాడు. "పిచ్చి తల్లి! ఏమీ తెలియదు" అని కూతురు తల నిమిరాడు. తక్షణం స్వయంగా వరాన్వేషణ ప్రారంభించాడు.

✦

"మీ పేరు?"

"భాస్కరం"

"ఏం చదువుకున్నారు?"

"................."

"గవర్నమెంటు ఉద్యోగమా?"

"................."

"అస్తి ఏ మాత్రం?"

"................."

కోటు కాలరు సరిచేసుకుంటూ నింగితుడు లాయుడు ప్రశ్నలకి సమాధానా లిస్తున్నట్టు జవాబులు చెప్పుకుపోతున్నాడు పెళ్ళికొడుకు సుశీల తండ్రికి. ఒకటి రెండుసార్లు బెరుగ్గానే సుశీలకేసి చూశాడు. సుశీల ముందు తళ తళ మెరిసే అతని బూటు వంకా, తరువాత రంగు రంగుల టై వంకా, సిల్కు సూటు వంకా ఎగాదిగా చూసి తల దించేసుకుంది. మరి ఒక్క మాట మాట్లాడలేదు. పిల్ల అట్టే మాటాడదనీ, బిడియం ఎక్కువనీ సంజాయిషీ చెప్పుకున్నాడు తండ్రి.

ఆ రాత్రి భోజనాల దగ్గిర వచ్చి నతని అందచందాలనీ తెలివి తేటలనీ తెగ పొగిడేస్తున్నారు తల్లీ తండ్రీ. మౌనంగా అన్నం తింటున్న సుశీలకి మరి కాస్త గటి పెరుగు వడిస్తూ,

"ఎలా వున్నాడే?" అంది తల్లి ప్రేమగా.

"మీరూ చూశారుగా!" అంది సుశీల తల వంచుకునే.

"అలా కాదమ్మా! నీ వుద్దేశం చెప్పు!" అన్నాడు తండ్రి.

"ఏం చెప్పను? అయిదు నిముషాలు మని షిని చూసి ఏం చెప్పను?"

ఆ సమాధానం తండ్రి మనసులో కలుక్కుమని గుచ్చుకుంది. అంతటితో ఆ ప్రసంగం ముగిసిపోయింది.

మరోసారి హోదాగల ఆఫీసరే వచ్చాడు సుశీలని చూట్టానికి. ఈ మాటు ప్రశ్న లడిగే వంతు అతను పుచ్చుకున్నాడు. అవసరమైనవీ, అవసరం లేనివీ, ఆ సమయానికి నోటికి వచ్చినవీ ఎన్నో ప్రశ్నలు వేసేశాడు. చివరికి సుశీలని "విడిగా" ప్రశ్నలు వేయాలనే కోరిక వెల డించాడు. వైద్యుడు ఏం ప్రశ్నలు వేస్తాడో యని తల్లడిల్లిపోయే రోగికిమల్లే బిక్కముఖం పెట్టి దీనంగా తండ్రివంక చూసింది సుశీల. కానీ ఆ సమయంలో ఆమెను రక్షించేవాళ్లవరూ లేకపోయారు. అతను ఇలా అడిగేశాడు.

"మీకు ఆటలు వచ్చునా?"

"అంటే?" ముఖం చిట్లించింది సుశీల.

"ఐ మీన్ .... స్పోర్ట్సులో ఇంటరెస్టు వుందా?"

"లేదు."

"మీ అభిమాన సినిమా నటీ నటు లెవరు?"

"సాయంకాలాలు వాకింగుకు వెళతారా?"

"ఏ టూత్ పేస్టు వాడుతారు?"

వగైరా వగైరా ప్రశ్నలు వేసేస్తున్నాడు వచ్చిన పెద్దమనిషి. కలలో కూడా తను అటువంటి క్లిష్ట పరిస్థితిలో ఇరుక్కుంటుందని గానీ, అలాటి ప్రశ్నల ధాటికి గురికావలసి వస్తుందని గానీ ఊహించని సుశీల గుడ్లు మిటకరించి, వెర్రిగా అతనికేసి చూస్తూ అలా కూర్చుండి పోయింది

మరోసారి ఇంకో విచిత్ర సంఘటన జరిగింది. ఆవేళ ఆదివారం. తండ్రి ఇంటో లేడు. తల్లి వంటింట్లో హడావుడిగా వుంది. ఫలానావారి ఇలు అదేనా అంటూ ఓ నడికారు మనిషి ఇంట్లో ప్రవేశించాడు. పెళ్ళికొడుకులా కాదుకదా కనీసం పెళ్ళికొడుకు తరఫు చుట్టం లాగైనా ఆ యింట్లో కాలు పెట్టటానికి అర్హత లేనట్టు కనుపించే అతని వేషధారణ, మాటల తీరూ చూసి కూర్చోమని అనటమే మరిచి పోయింది సుశీల. అతనుమటుకు దసువుగా కుర్చీ లాక్కు కూర్చుని, సుశీల తను చూడవలసిన వ్యక్తి అని నిశ్చయించుకుని, సూటిగా, తీవ్రంగా ఆమెమీద చూపులు విసిరాడు. సుశీల ఆ ధాటికి తట్టుకోలేక మాటలు తడబడుతూ తండ్రి అవేళ ఇంటికి రాదని

కొంకేసింది. కానీ అతను అలా తొందరగా విడిచే ఘటం కాదు. వ్యవహారం అప్పుడే అక్కడే తేల్చేసుకోవటం మంచిదనో ఏమో.

"నన్ను గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు సిగ్గును దాచుకుంటూ పెదిమలు వంకరగా పెట్టి.

అదే సుశీలకు "సన్ స్ట్రోక్" ఆమె తల గిర్రున తిరిగింది. కోపంతో రోషంతో పెదిమలు వణికాయి. సమీపంలో వున్న దేదయినా చేతిలో పుచ్చుకు అతనిమీద విసిరేయాలన్నంత ఆవేశం కూడా కలిగింది. కానీ తమాయించుకుంది అతన్ని పంపేసింది. ఆ షాక్‌కి ఓ వారం రోజులపాటు ఎవరితోనూ మాట్లాడలేకపోయింది.

పెళ్ళి ప్రయత్నాలన్నీ అలా ఘోరంగా పరిణమిస్తున్నాయనీ, తొందరగా ఏదీ తేలటం లేదనీ దంపతులు లోలోపలే బెంగపడిపోయారు. కూతురు పెళ్ళి విషయం "వూళ్ళో" జరిగే హడావుడి, ఆ ప్రకారం మనసులో అనుకున్నవీ, ఉత్తరాల దగ్గరే విరమించుకున్నవీ, గుమ్మం వరకూ వచ్చినవీ, అన్నీ కలిసి మొత్తం సుశీలకు (లోకం దృష్టిలో) చాలా పెళ్ళిళ్ళు జరిగి పోవటమూ ఏ తల్లి దండ్రుల మనసు చివుక్కు మనిపించదు?

ఇలా ఉండగా ఇంట్లో ఓ రోజు అటంబాంబు పేలింది. సుశీల గదిలో అలికిడి విని అటువైపు వెళ్ళిన తల్లికి ఈ మాటలు వినిపించాయి.

"ఏమిటే సుశీ ఆ పుత్తరం? నీకు ఏమయినా మతిపోయిందా?"

"ఊహు.... ఇంకా పోలేదు. ఆ లక్షణాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి"

"నీ ధోరణి నాకేం బాగాలేదు. ఇదేమయినా అల్లాటప్పా వ్యవహారమనుకున్నావా? జీవితానికి సంబంధించిన ముఖ్య విషయం."

"అయితే ఏమంటావ్?"

"ఏదో ఇన్నాళ్ళూ మర్యాదగానే ఈ గుమ్మం తొక్కగలుగుతున్నాను. మీ వాళ్ళకే గనుక ఈ సంగతి తెలిస్తే నా ఒంట్లో సున్నం లేకుండా...."

"ఆగు జగ్గూ! ఈ ఉపన్యాసాలివ్వటానికేనా అంతదూరంనుంచి కపకప వచ్చావు? నీకు ఇష్టం లేకపోతే......"

"అలా అంటే నేనేం చెప్పను సుశీ? శాంతంగా ఆలోచించి చూడు. ఏదో బలహీన క్షణంలో నాకు ఆ పుత్తరం రాసి వుంటావు, నిజం చెప్పు? నీకు నేను ఏ విధంగా....... పోనీ మీ నాన్న ఏమంటారో ఆలోచించావా? రేపు నలుగురూ ఏమనుకుంటారు?"

"జగ్గూ! ఈ "అనుకోడా"లతో నా ప్రాణం విసిగి పోయివుంది నాకు ఎవరి సలహా వొద్దు, అభిప్రాయం వొద్దు, విమర్శ వొద్దు. వాళ్ళంతా నన్ను అర్చేవాళ్ళూ, తీర్చేవాళ్ళూ కనుకనా?"

"అయితే మా వాళ్లు 'కాదు' అంటే ఏం చేస్తావ్?"

"అంటే అన్నారు................"

తల్లి గట్టిగా చెవులు మూసుకుని ఒక్క పరుగున భర్త దగ్గరికి వెళ్ళి, "ఏమండోయ్! కొంప మునిగింది!" అని గావుకేక పెట్టింది. రొప్పుతూ రోజుతూ జరిగిన సంభాషణంతా అతని చెవిలో వేసింది.


"బెల్లం కొట్టిన రాయిలా అలా కూర్చుంటారేమిటండీ? ఒక మూల కొంప అంటుకు పోతుంటేను! లేవరేం? అదేదో రిజిస్టరట! అందమా? ఆస్తా? ఏమని యిస్తామంటు రత్నం లాంటి పిల్లని? వెంటనే ఆ జగన్నాధాన్ని బయటికి పంపుతారా? లేదా? ఈ పెళ్ళే గనుక జరిగితే నేను వురిపెట్టుకు చస్తాను" అన్నది రాగాలు పెడుతూ.

అతను మాటకు ఉలకలేదు. పలకలేదు సుశీల గదికేసి చూసే ధైర్యం లేక మెదడు పనిచేయుటలు ఆగిపోవటంవల్ల, కళ్ళు గట్టిగా మూసేసుకున్నాడు.

సుశీల తల్లి ఊరి పోసుకోలేదు. తండ్రి మనస్ఫూర్తిగా అంగీకరించనూ లేదు. కానీ సుశీల పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళి మంటపంలో, సదస్యుల సమక్షంలో, మేళతాళాల ఊదరలో కాదు—ప్రశాంతమైన రిజిస్ట్రరు ఆఫీసు వాతావరణంలో ముగ్గురి సన్నిహిత స్నేహితుల సాక్షి సంతకాలతో పూర్తయింది. కనీసం విందయినా ఏర్పాటు చెయ్యరా, పెళ్లికొడుకుని చూద్దామని తహతహలాడిన వారికి ఆశాభంగమే కలిగిందనే చెప్పాలి.

అందుకనే అనుకున్నారు చాటుగా. "ఏమో! ఎవర్నీ పిలవకుండా చేశారు పెళ్ళి! ఏం జరిగిందో!" అని, ఆ మాట విన్న సుశీల తల్లి దండ్రులు అవమాన భారంతో తలలు దించేసుకున్నారు. "అసలు పెళ్ళి జరిగినట్టు దాఖలా ఏమిటి?" అని తమ తెలివితేటలు బయటపెట్టారు కొందరు. దాన్నే సులువుగా అందరికీ అర్థమయ్యే భాషలో "లేచిపోయింది" అన్నారు మరికొందరు. అందుకనే కాబోలు ఇప్పటికీ "జగు"ని చూస్తే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటూ వుంటుంది సుశీల తల్లి. ★

1956వ సంవత్సరపు శ్రేష్ఠమైన
6 గుండ్ల చేతి తుపాకి
లైసెన్స్ అవసరం లేదు.




ఈ చేతి తుపాకిని వాడడం సూర్యునికి వెలుతురు నిచ్చేటట్లు ఉండును. ఇది అమెరికాలో తయారై దిగుమతి కాబడినది. దీని విశేషమేమనగా ఒకదఫా 6 గుండ్లను అమర్చగల ఒక గది దీనియందు గలదు. మీటను అదమగానే గది తలుపు తెరుచుకోబడి ఈ 6 గుండ్లు ఒకటి తరువాత మరొకటిగా అతివేగంగా బైటకివచ్చును. దీని బలమైన శబ్దం తుపాకి కాల్చు వారినికూడా భ్రమింపజేయును. మీ ప్రాణాన్ని, ఆస్తిని కాపాడుకొనుటకు ఈ తుపాకిని మించినది వేరొకటియుండదు. దీని శక్తియు, ధ్వనిశబ్దము అతిపిస్సగాలను భయపడేటట్లుచేస్తుంది. అసలు రివాల్వర్ తుపాకి వలె వుంటుంది. సైజు 7½"×4" ఈ తుపాకులు మావద్దమాత్రమే లభించును.

నం. 4999. 12 గుండ్లు రు. 6-12-0. స్పెషలు క్వాలిటి 12 గుండ్లు రు. 8-12-0.

తపాలుచార్జి ప్రత్యేకం. చేతి తుపాకి నూనె 1 బుడ్డి 75 పెంట్లు.

విడి గుండ్లు ప్రత్యేకంగా డజను రు. 1-8-0

గమనిక: మీ పేరు, విలాసము ఇంగ్లీషులో వ్రాసి పంపండి.

AMERICAN TRADING COMPANY, (A.P.W.)
NAKODAR (PUNJAB)